
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



5 సిద్దిపేట
సోమవారం 24 నవంబరు 2025

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డికి ఇందిరా మహిళాశక్తి చీరను అందజేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో మంత్రి దామోదర్‌తో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చిన నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చినమాట నెరవేర్చడమే కాంగ్రెస్ తత్వమన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగిన ఇళ్లు బాగుపడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సమష్టిగా సంక్షేమ పథకాల్లో మహిళలనే లబ్ధిదారులుగా చేర్చుతూ కోటి మందిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఇందిరమ్మ చీరలు కొందరికే పంపిణీ చేస్తున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పది నుంచి పదిహేను మంది మహిళలు కలిసి పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపనలో మహిళలు రాణించేందుకు అవసరమైన సహాయం అందజేస్తానని నిర్మలాజగ్గారెడ్డి తెలిపారు.



ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీలో మంత్రి దామోదర్‌తో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

కొండపాక మండలం దుద్దెడ టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. ఆదివారం రాత్రి ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనాలు వరుస కట్టాయి. వారాంతంతో పాటు వివాహాలు శుభకార్యాలకు ఊర్లకు వచ్చిన వారు, తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండడంతో వాహనాల రద్దీ ఎక్కువైంది.

-కొండపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి)



పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ప్రశాంతంగా మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష

● 98.14 శాతం విద్యార్థుల హాజరు నమోదు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎమ్ఎమ్ఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సిద్దిపేటలో 5, గజ్వేల్, హుస్నాబాద్‌లో రెండు చొప్పున కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఆదివారం ఉదయం 9.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష కొనసాగింది. 1,723 మంది విద్యార్థులకు 32 మంది గైర్హాజరయ్యారు. 98.14 శాతం హాజరునమోదైందని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని పలు సెంటర్లను డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం నాలుగేళ్ల పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు కేంద్రం ప్రభుత్వం నుంచి ఏటా రూ.12 వేల స్కాలర్‌షిప్ అందిస్తారు.



సిద్దిపేటలోని సెంటర్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తొగుటలోని పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో అక్టోబరు 24న మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 269 మంది రైతుల నుంచి 2,215 క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేశారు. కానీ ఒక్క రైతు ఖాతాలో కూడా డబ్బులు జమ కాలేదు.

మిరుదొడ్డి మార్కెట్ యార్డులోని కేంద్రంలో సుమారు 100 మంది రైతుల నుంచి మక్కలు కొనుగోలు చేశారు. దాదాపు రూ.1.20 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. నెలరోజులు కావొస్తున్నా డబ్బు పడలేదని రైతులు చెబుతున్నారు.

హుస్నాబాద్ మార్కెట్ యార్డులో అత్యధికంగా 6,340 క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేశారు. ఇప్పటికీ కేంద్రంలో పెద్దఎత్తున మక్కలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. రూ.1.50 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. విక్రయించి నెలరోజులు గడుస్తున్నా డబ్బు పడకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.



సిద్దిపేట మార్కెట్ యార్డులో ఆరబెట్టిన మొక్కజొన్నలు

మక్క కంరంతో..

ఖాతాలో డబ్బులు జమ చేయాలని రైతుల డిమాండ్

రేపుమాపు అంటున్న అధికారులు
నెలరోజులుగా ఎదురుచూపులు
85,330 క్వింటాళ్లు కొనుగోలు
ఇప్పటికీ పోటెత్తుతున్న మొక్కజొన్న
రైతులకు రూ. 20 కోట్లకుపైగానే చెల్లించాల్సిన పరిస్థితి

సిద్దిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. మక్కలు విక్రయించడానికి కొంతమంది వస్తుండగా.. ఆ విక్రయించిన మక్కల డబ్బుల కోసం మరొకొందరు నిత్యం తిరుగుతూనే ఉన్నారు. దాదాపు నెలరోజుల కాలంగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. యాసంగి పెట్టుబడి కోసం డబ్బులు అందుతాయని భావించగా.. రేపుమాపు

మిగతా 8వ పేజీలో



ఇరవై రోజులైనా జమ కాలేదు

మూడెకరాల్లో సాగుచేసి 75 క్వింటాళ్ల మొక్కజొన్న పండించా. మద్దతు ధర వస్తుందని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాం. 20 రోజులైతున్నా డబ్బు జమకాలేదు. అధికారుల చుట్టూ తిరిగితే రేపుమాపు అంటున్నారు. వెంటనే డబ్బు చెల్లించాలి.

-చెరుకు సంధ్య, తుక్కాపూర్

త్యాగం మాది... నీళ్లు హైదరాబాద్‌కా?

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ నిర్మాణంలో భూములు త్యాగం చేసింది దుబ్బాక ప్రాంతమని, తమకు నీళ్ల ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాడైన రోడ్ల మరమ్మతు నిధులను మళ్లించిన ప్రభుత్వం తిరిగి నిధులు విడుదల చేయకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆదివారం దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, మరమ్మతుకు పైసా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. నిధులు ఇవ్వకుంటే దేశంలో ఎక్కడా లేనివిధంగా దుబ్బాక నుంచే పెద్దఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో డబ్బులు, బహుమతులు పంపిణీ చేసి విజయం సాధించిన కాంగ్రెస్, పంచాయతీ ఎన్నికల్లోనూ ఇందిరమ్మ చీరల పేరుతో రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రేవంత్ సర్కార్ రెండేళ్లుగా బతుకమ్మ చీరలు ఇవ్వకుండా కేవలం మహిళా సంఘాలకు మాత్రమే పరిమితం చేసి, ఎన్నికల సమయంలో పంపిణీ చేస్తోందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు సరైన బుద్ధి చెప్తారని ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

ఇందిరమ్మ చీరలతో మహిళలకు ఆత్మగౌరవం

కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

గౌరవెల్లి నుంచి సాగునీరందించి హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

కోహెడ/అక్కన్నపేట/హుస్నాబాద్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా అనేక పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తున్నామని, మహిళలను ఉన్నత స్థానంలో నిలపడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఉద్ఘాటించారు. ఆదివారం కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ రూరల్‌లలో కలెక్టర్ హైమావతితో కలిసి మహిళా సంఘాల సభ్యులకు ఇందిరా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలంతా ఐక్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ చీరల పంపిణీ చేపట్టామని తెలిపారు. ఈ చీరలు మహిళా సంఘాల ఐక్యత, క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తాయన్నారు. మహిళా సంఘాలకు

మిగతా 8వ పేజీలో



కోహెడలో చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హైమావతి

గాయత్రీ శ్లోకం చదివిన కలెక్టర్

ఇందిరా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం సందర్భంగా హుస్నాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి గాయత్రీ, భక్తి శ్లోకాలు చదివి మహిళలను ఉత్తేజపరుస్తూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు శక్తి స్వరూపులు అని అన్నారు. సహాయక సంఘాల ద్వారా సంమటి తమ్మె ప్రభుత్వ సహకారంతో వ్యాపార రంగంలోనూ రాణిస్తున్నారన్నారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితో మహిళలు తమలో దాగి ఉన్న శక్తిని పూర్తిగా ఉపయోగించుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

కోహెడ మండలంలోని తంగళ్లపల్లి గ్రామ శివారులో దాదాపు 23 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న నేషనల్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను కలెక్టర్ హైమావతి ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ విద్యాసంస్థకు నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. ప్రభుత్వ స్థలం చుట్టూ సర్వే చేసి హద్దులు వేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

సత్యసాయి ఆశయాలు సజీవం

మానవ సేవే మాధవ సేవ అని చాటిచెప్పిన మహానుభావుడు బాబా

సాయి సంస్థలు నిరంతరం ధర్మస్థాపనలో తరిస్తున్నాయి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సాయి భజనలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శరీరం శాశ్వతం కాదు, సేవ శాశ్వతం అని సందేశమిచ్చిన సత్యసాయి బాబా వారి ఆశయాలు ఎన్నాళ్లకైనా సజీవంగా ఉంటాయని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలోని సత్యసాయిబాబా దేవాలయంలో నిర్వహించిన శత జయంతి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. భగవాన్ శ్రీసత్య సాయి బాబా కేవలం ఆధ్యాత్మికత, ధర్మస్థాపన, నీతి బోధనకే పరిమితం కాలేదని, ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి మానవ సేవే మాధవ సేవ అని చాటిచెప్పిన మహానుభావుడని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అబ్దుల్‌కలాం, సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్ వంటి ప్రముఖులు కూడా బాబా భక్తులుగా మారారని గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి పుట్టపర్తిని దర్శించుకొని మూడు రోజుల పాటు వారి సేవల్లో ఉన్నప్పుడు, బాబా అందించే సేవా కార్యక్రమాలను దగ్గరగా చూశామని

మిగతా 8వ పేజీలో

కరుణామయుడికి కోత కాలపు కృతజ్ఞతార్పణ
పంటలు సమర్పించిన రైతులు
భక్తులతో కిటకిటలాడిన మెదక్ సీఎస్ఐ చర్చి 7

'అమ్మా.. నన్ను నలుగురు కొడుతున్నారు'
బస్వాపూర్‌లో అనుమానాస్పదంగా యువకుడి మృతి 7



జీవితం సాఫీగా సాగుతున్న వేళ విధి చిన్న చూపు చూసింది. అనుకోని రోడ్డు ప్రమాదం అతడి జీవితాన్ని చీకటిమయం చేసింది. ఓ చేయి కోల్పోయినా సరే, ఆ యువకుడు అంతులేని ఆత్మవిశ్వాసాన్ని ఆయుధంగా చేసుకుని ధైర్యంగా బతుకు పోరాటం చేస్తున్న తీరు ఎందరికో స్ఫూర్తినిస్తోంది. అతడే సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామానికి చెందిన కానుగుల యాదగిరి (36) కథ ఇది..

ఒంటిచేతితో బతుకు పోరాటం

కుడి చేయి కోల్పోయినా కుంగిపోని ఆత్మవిశ్వాసం

దివ్యాంగుడైనా కుటుంబానికి వెన్నెముకగా నిలిచి..

స్ఫూర్తిదాయకం యాదగిరి జీవితం

కుకునూరుపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వరకు చదివిన యాదగిరి చదువుకు స్వస్తి చెప్పి వ్యవసాయం, ఇతర పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. భార్య, ఇద్దరు కుమారులతో అతడి జీవితం సంతోషంగా సాగుతున్న సమయంలో 2022లో గూడ్స్ ఆటో కొన్నాడు. 2023లో దురదృష్టవశాత్తు ఓ మూలమలుపు వద్ద ఆటో బోల్తా పడటంతో యాదగిరి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స అందించినా, ప్రమాద తీవ్రత కారణంగా అతడి కుడిచేతిని వైద్యులు తొలగించాల్సి వచ్చింది. చికిత్సకు లక్షల్లో ఖర్చు కావడంతో ఆ కుటుంబం ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతింది.

చేయి మాత్రమే పోయింది... ఆత్మవిశ్వాసం కాదు

ఈ ప్రమాదం యాదగిరిని శారీరకంగా దెబ్బతీసినా, మానసికంగా మాత్రం కుంగదీయలేకపోయింది. ఐదు నెలల విశ్రాంతి తర్వాత 'నాకు చేయి మాత్రమే పోయింది... నా ఆత్మవిశ్వాసం కాదు' అని దృఢంగా నిశ్చయించుకున్నాడు. విధిరాతను లెక్కచేయకుండా, ఆత్మవిశ్వాసంతో పనుల్లోకి దిగాడు. రబీ, ఖరీఫ్ సీజన్లలో గ్రామంలోని పీఏసీఎస్ కేంద్రంలో హమాలీ పనులను ఎంచుకున్నాడు. ధాన్యం బస్తాలను తూకం వేయడం, ఆపై ఒంటిచేత్తోనే వాటిని లారీల్లోకి ఎత్తుకుంటూ, మిగిలినవారితో సమానంగా పని చేసుకుంటున్నాడు. అంతేకాక తనకు ఉన్న 20 గుంటల భూమిలో భార్య సహాయంతో వ్యవసాయం చేస్తూ కుటుంబానికి వెన్నెముకగా నిలుస్తున్నాడు. శరీర అవయవాలు సక్రమంగా ఉన్నా నిరాశతో పక్కదారి పడుతున్న నేటి యువతకు యాదగిరి జీవితం నిజంగా ఓ జీవిత పాఠం. తన కుటుంబాన్ని గౌరవంగా పోషించుకునేందుకు ప్రభుత్వం, అధికారులు ఏదైనా సహాయం అందిస్తే బాగుంటుందని యువకుడు విజ్ఞప్తి చేస్తున్నాడు.



బస్తాను లారీలోకి తీసుకెళ్తున్న యాదగిరి

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

● ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి, కారు బోల్తా పడి మరో ముగ్గురికి..

పుల్కల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తానాపూర్ గ్రామ శివారులో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని చక్రియాల గ్రామానికి చెందిన మినపూర్ పండరి తన ద్విచక్ర వాహనంపై సుల్తానాపూర్ వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ప్రాంతాలకు చెందిన సాయిసద్గురు, వెంకటప్రసాద్ టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో వెనుక వస్తున్న వారి ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ముందు వెళ్తున్న పండరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ముగ్గురికీ గాయాలయ్యాయి. అదే రహదారిపై సంగారెడ్డి వైపునకు వెళ్తున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని నిలిపి, ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు సపర్యలు చేశారు. అనంతరం వారిని ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్స్‌లో సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.


క్షతగాత్రుడిని అంబులెన్సులో ఎక్కిస్తున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్

కారు బోల్తాపడి..

మండల కేంద్రమైన చౌటకూర్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని బోడుప్పల్ ప్రాంతానికి చెందిన నాగరాజు, కిరణ్, శివరాం రాథోడ్‌లు కారులో నారాయణఖేడ్ వెళ్లి తిరిగి వస్తున్నారు. వారి కారు సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిపై టీ టైం హోటల్ వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా కొట్టింది. రహదారి మధ్యలోని కాలువలోకి దూసుకుపోయి, పల్టీలు కొట్టి జోగిపేట వైపునకు వెళ్లే రహదారిపై తిరగబడింది. ఈ సంఘటనలో పై ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.


ప్రమాదానికి గురైన కారు

కుక్కను చంపాడన్న నెపంతో
వ్యక్తిపై హత్యాయత్నం

● ఐదుగురిపై కేసు నమోదు

పుల్కల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుక్కను చంపాడన్న నెపంతో ఓ వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెండికోలు గ్రామంలో జరిగింది. ఎస్ఐ ఎన్. విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బంటు మల్లయ్య పెంపుడు కుక్క మూడు నెలల క్రితం చనిపోయింది. ఆ కుక్కను అదే గ్రామానికి చెందిన నీరుడి నర్సింలు చంపాడంటూ మల్లయ్య గొడవ పడ్డాడు. అప్పటి నుంచి ఇరు కుటుంబాలు దూరంగా ఉంటున్నారు. ఈ నెల 16న కుక్క మృతి విషయమై బంటు మల్లయ్య, నర్సింహులు ఇంటికి వచ్చి మళ్లీ గొడవ పడగా, నర్సింహులు కుమారుడు సన్నీ ఇద్దరినీ అక్కడి నుంచి పంపించేశాడు. తాజాగా శనివారం, బంటు మల్లయ్య మరదలు రేణుక, నీరుడి నర్సింహులు ఇంటి వద్దకు వచ్చి గొడవకు పాల్పడింది. ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో రేణుకకు తోడుగా ఆమె భర్త కృష్ణ, బంటు మల్లయ్య, ఆయన భార్య మల్లమ్మ, కుమారుడు మహేశ్ అక్కడికి చేరుకున్నారు. వారంతా కలిసి నర్సింలును బూతులు తిడుతూ, వీధిలో పడేసి కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన నర్సింహులును చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. బాధితుడు నీరుడి నర్సింహులు కుమారుడు సన్నీ ఫిర్యాదు మేరకు ఆ ఐదుగురిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆదివారం వారిని రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ ఎన్. విశ్వజన్ తెలిపారు.


ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన నీరుడి నర్సింహులు

విద్యుదాఘాతంతో రైతు మృతి


ఆంజనేయులు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కొండపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన కొండపాకలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... కొండపాకకు చెందిన చేబర్తి ఆంజనేయులు (58) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న వ్యవసాయ భూమిలో ఇటీవల వరి కోయగా, మళ్లీ సాగు చేయడం కోసం పొలంలో నీళ్లు అందిస్తున్నాడు. ఆదివారం రోజు మాదిరిగా పొలం పనులకు వెళ్లి మోటార్ ఆన్ చేస్తుండగా, అనుకోకుండా విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుని కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

'అమ్మా.. నన్ను నలుగురు కొడుతున్నారు..'

● అనుమానాస్పదంగా యువకుడి మృతి

ములుగు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా నన్ను నలుగురు కొడుతున్నారు' అంటూ ఫోన్‌లో కొడుకు తెలుపగా.. అక్కడికి వెళ్లిన చూసే సరికి విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ సంఘటన బస్వాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన నర్సంపల్లి సందీప్(21) శనివారం సాయంత్రం నాలుగు గంటలకు తుర్కపల్లి కంపెనీలో ఉద్యోగం ముగించుకొని ఇంటికి వచ్చాడు. అనంతరం కొత్తూరు గ్రామానికి వెళ్లి హెయిర్ కటింగ్ చేయించుకొని వస్తానని చెప్పి మోటార్ సైకిల్‌పై బయటికెళ్లి తిరిగిరాలేదు. సాయంత్రం అతని తల్లి రేణుక, సందీప్ మొబైల్‌కు కాల్ చేయగా, ఇంకా కటింగ్ అవ్వలేదని చెప్పాడు. రాత్రి 9:30 గడుస్తున్నా ఇంటికి రాకపోవడంతో కొడుకుకు మళ్లీ ఫోన్ చేయగా 'అమ్మా నన్ను కొడుతున్నారు' అని చెబుతూ ఉండగా ఫోన్ కట్ అయింది. తిరిగి సందీప్ తన తల్లికి రాత్రి 10 గంటలకు ఫోన్ చేసి 'అమ్మ కొత్తూరులోని పెద్దమ్మ గుడి వెనకాల నలుగురు వ్యక్తులు మధు, నందు, అరుణ్, అనిల్ నన్ను కొడుతున్నారని' చెప్పాడు. దీంతో వెంటనే తల్లి రేణుక కుటుంబ సభ్యులతో కలిసి కొత్తూరులోని పెద్దమ్మ గుడి వెనకాల వెతకగా అక్కడ కనిపించలేదు. కొడుకు సందీప్‌కు ఫోన్ చేస్తే ఎంతకు లిఫ్ట్ చేయలేదు. కొత్తూరు గ్రామ శివారులో రోడ్డుకు ఇరువైపులా వెతుకుతూ ఉండగా, రోడ్డుకు ఒకవైపు బండి, మరో వైపు సందీప్ పడి ఉండడాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. అప్పటికే సందీప్ మరణించి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై రఘుపతి తెలిపారు.


సందీప్(ఫైల్)

అప్పుల బాధతో కూలీ ఆత్మహత్య

దుబ్బాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాక మండలం ఆకారం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. దుబ్బాక సీఐ పి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దప్పు చంద్రం(50) ఆకారం గ్రామంలో కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం కొన్ని అప్పులు చేసిన చంద్రం, ఇటీవల నాలుగు నెలల క్రితం అప్పులు తీర్చేందుకు ఒక ఎకరం భూమిని అమ్మాడు. వాటితో కొన్ని అప్పులు తీర్చగా, మరికొన్ని అప్పులు అలాగే మిగిలిపోయాయి. మిగిలిన అప్పుల గురించి తీవ్రంగా ఆలోచిస్తూ, తనలో తాను బాధపడుతున్న చంద్రం శనివారం రాత్రి గ్రామ శివారులో ఒక చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహానికి స్థానిక వంద పడకల ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్టు సీఐ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరికి రిమాండ్

బెజ్జంకి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సేవిస్తూ పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం రాత్రి బెజ్జంకి పోలీసు స్టేషన్‌లో సీఐ వెల్లడించారు. మండలంలోని ముత్తన్నపేటకు చెందిన కనగండ్ల అజయ్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సోమవారంపేటకు చెందిన తడ్కపల్లి శేఖర్ బెజ్జంకి శివారులో గంజాయి సేవిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఇద్దరు గంజాయి సేవిస్తూ విక్రయిస్తుంటారని గతంలో అజయ్ గంజాయి కేసులో అరెస్టు అయి జైలుకు వెళ్లి వచ్చాడని, శేఖర్ పై ఇల్లంతకుంట పోలీసు స్టేషన్‌లో మూడు గంజాయి కేసులు ఉన్నాయని తెలిపారు. ఇద్దరి పై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీను తెలిపారు. సీఐ వెంట చిన్నకోడూరు ఎస్ఐ సైఫ్ అలీ, రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్, బెజ్జంకి ఏఎస్ఐ శంకర్‌రావు ఉన్నారు.

కరుణామయుడికి కోత కాలపు కృతజ్ఞతార్పణ



చర్చి వేదికను వివిధరకాల పండ్లు పూలు తోరణాలతో అలంకరించిన భక్తులు

- కోత పంటలు సమర్పించిన రైతులు
- భక్తులతో కిటకిటలాడిన చర్చి పరిసరాలు

మెదక్ కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం కోత కాలపు కృతజ్ఞతార్పణల పండుగ ఘనంగా జరిగింది. దీంతో భక్తుల ప్రార్థనలతో చర్చి పరిసరాలు కిక్కిరిసిపోయాయి. క్రైస్తవులు ప్రతి ఏటా పంట చేతికొచ్చిన సమయంలో, తొలి పంట ఫలాలను దేవుడికి సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది. మెదక్ చర్చిలో కోత కాలపు కృతజ్ఞతార్పణల పండుగను అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిని మామిడి తోరణాలు, అరటి చెట్లు, బంతి పూలు, సీతాఫలాలు, వివిధ రకాల పండ్లతో శోభాయమానంగా అలంకరించారు. దక్షిణ భారత సంఘం (సీఎస్ఐ) మెదక్ డయాసిస్ పరిధిలోని వివిధ జిల్లాల నుంచి క్రైస్తవులు తమ పంట ఉత్పత్తులైన పండ్లు, కూరగాయలు, వరి కంకులను తీసుకొచ్చి దేవుడికి సమర్పించారు. వాటిని చర్చి లోపల ఉన్న వేదిక వద్ద క్రమ పద్ధతిలో చూడముచ్చటగా అమర్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి బిషప్ రూబెన్ మార్క్ మాట్లాడుతూ.. ఏటా మనకు వచ్చిన పంటలలో పది శాతం దేవుడికి సమర్పించడం వలన దేవుడు మనకు అంతకంటే ఎక్కువే ప్రసాదిస్తాడని అన్నారు. ఈ పండుగలో మత గురువులు, చర్చి కమిటీ సభ్యులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి, ఇతర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల ప్రార్థనా గీతాలు అలరించాయి. భక్తులు, సందర్శకులు కుటుంబ సభ్యులతో కలిసి చర్చి ఆవరణలో విందు భోజనాలు చేస్తూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. దీంతో చర్చి పరిసరాలలోని దుకాణ సముదాయాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



ప్రార్థనలో భక్తులు

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీకి సిద్దిపేట క్రీడాకారుడు ఎంపిక

- అభినందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



అర్ఫాజ్ అహ్మద్‌ను అభినందిస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి కోల్‌కతాలో జరగనున్న బీసీసీఐ సీనియర్ మెన్స్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (టీ20) కోసం హెచ్‌సీఏ టీమ్‌కు సిద్దిపేట క్రికెట్ క్రీడాకారుడు అర్ఫాజ్ అహ్మద్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. సిద్దిపేట క్రికెట్ స్టేడియాన్ని ఫ్లడ్‌లైట్స్‌తో అద్భుతంగా అభివృద్ధి చేశామని హరీశ్‌రావు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా కేసీఆర్ క్రికెట్ ట్రోఫీని నిర్వహించామని గుర్తుచేశారు. అంతేకాకుండా, స్టేడియం అభివృద్ధి జరిగింది కాబట్టే సిద్దిపేటలో టీ20 మ్యాచ్‌లు నిర్వహించామన్నారు. సిద్దిపేట క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎదగాలనే తపనతోనే స్టేడియాన్ని అభివృద్ధి చేశామన్నారు. సిద్దిపేట స్టేడియం నుంచి నేడు జాతీయ వేదికపై ఆడటం ఒక ప్రజాప్రతినిధిగా తనకు ఎంతో సంతోషంగా ఉందని, ఇలా ఫలితాలు వచ్చినప్పుడే చేసిన పనికి సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. అహ్మద్ మరింత రాణించాలని, భవిష్యత్తులో మరిన్ని జాతీయ మ్యాచ్‌లలో పాల్గొనాలని ఆకాంక్షిస్తూ, తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయిలో మెరిసిన మనిషా సిర్వి



మనిషా సిర్వికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

గుమ్మడిదల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన 'ఇన్‌స్పైర్ మానక్-2025' కోసం శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థిని మనిషా సిర్వి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిమ్ముల జైపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ చిమ్ముల లత మాట్లాడుతూ సామాజిక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను అన్వేషించే దిశగా మనిషా రూపొందించిన వినూత్న ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికలో నిలిచిందని వారు వివరించారు. మనిషా ప్రతిభను గుర్తించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆమెకు ప్రత్యేకంగా బహుమతి ప్రదానం చేసి అభినందించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో కూడా మనిషా ప్రతిభను చాటుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల వర్గాలు ఆకాంక్షించాయి.

యూనిటీ మార్చ్‌కు రాఘవాపూర్ వాసి



రమేష్ కట్టర్

సిద్దిపేట రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న యూనిటీ మార్చ్‌కు సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన గణగోని రమేష్ కట్టర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ప్రారంభం కానున్న యూనిటీ మార్చ్ నాగ్‌పూర్, ఇండోర్ మీదుగా గుజరాత్‌లోని ఐక్యతా విగ్రహం వద్ద ముగుస్తుందని తెలిపారు. సిద్దిపేట జిల్లా నుంచి తనను ఎంపిక చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యమందించకుండా 'ప్రాక్టికల్స్'

- ఎంఎన్ఆర్ ఆసుపత్రి యాజమాన్యం నిర్వాకం
- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



సంతోష్‌కుమార్ (ఫైల్)

సంగారెడ్డి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలలో దారుణమైన సంఘటన చోటు చేసుకుంది. 20 సంవత్సరాలుగా ఎంఎన్ఆర్‌లో పనిచేస్తున్న సంతోష్ కుమార్(45) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. తమ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స చేస్తామని చెప్పి, యాజమాన్యం అతడిని ఎంఎన్ఆర్ ఆసుపత్రికి తరలించింది. తీవ్ర గాయాలతో ఉన్న సంతోష్ కుమార్‌కు మెరుగైన వైద్యం అందించాల్సిన వైద్యులు, వైద్య అధ్యాపకులు, వైద్య విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించేందుకు అతడిని ఉపయోగించారని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. సంతోష్ కుమార్‌కు సరైన వైద్యం అందించకపోవడం వల్లే చనిపోయాడని, ఈ విషయాన్ని యాజమాన్యాన్ని ప్రశ్నించగా తమపై దురుసుగా ప్రవర్తిస్తూ దాడి చేసేందుకు ప్రయత్నించారని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సంతోష్ కుమార్ కుటుంబ సభ్యులు ఎంఎన్ఆర్ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, న్యాయం జరిగేలా చూస్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

ప్రయాణం.. ప్రమాదం!

- గుంతలతో అధ్వానంగా మారిన సిర్గాపూర్ రోడ్డు
- మూడేళ్లుగా నత్తనడకన విస్తరణ పనులు
- రోడ్డు తవ్వకంతో విపరీతమైన దుమ్ము, ధూళి
- ప్రమాదాల బారిన వాహనదారులు

నారాయణఖేడ్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రవాణా సౌకర్యాలు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నా, కొన్ని ప్రాంతాల్లో పనులు మాత్రం అసంపూర్తిగా నిలిచిపోయి ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. అలాంటిదే నారాయణఖేడ్-సిర్గాపూర్ రోడ్డు. రోడ్డు విస్తరణ కోసం శంకుస్థాపన చేసి మూడేళ్లు కావస్తున్నా, పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తిగా వదిలేసిన పనులు

నారాయణఖేడ్ నుంచి సిర్గాపూర్ మీదుగా జాతీయ రహదారి 161కు అనుసంధానం చేసే మాసానపల్లి రోడ్డుపై సిర్గాపూర్ వరకు డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించడం కోసం 2023లో అప్పటి ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు అప్పట్లో రాష్ట్ర మంత్రిగా హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మొత్తం 12 కిలోమీటర్ల దూరంలో దాదాపు 9 కిలోమీటర్లు విస్తరణ కోసం తవ్వారు. కానీ, ఆ తర్వాత పనులను పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలివేశారు.



రోడ్డు విస్తరణకోసం తవ్వి వదిలి పెట్టిన దృశ్యం




నారాయణఖేడ్-సిర్గాపూర్ రోడ్డు విస్తరణ కోసం శంకు స్థాపన చేసిన శిలాఫలకం

గోతులు, దుమ్ముతో నరకం

గతంలో సింగిల్‌గా ఉన్న బీటీ రోడ్డు కాస్తా.. కాంట్రాక్టర్ తవ్వి వదిలివేయడంతో పూర్తిగా అధ్వాన్నంగా తయారైంది. అనేక చోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులమయమైన రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. పనులు అసంపూర్తిగా వదిలివేయడంతో రోడ్డంతా విపరీతమైన దుమ్ము వస్తుందని, ఇది వాహనదారులకు మరింత ప్రమాదకరంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు గుండానే జాతీయ రహదారికి వెళ్లడమే కాకుండా, కామారెడ్డి జిల్లాలోని పిట్లం వంటి ప్రాంతాలకు ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత సంవత్సరం నుంచి పనులను అసంపూర్తిగా వదిలివేయడంతో అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. తాజాగా, వారం రోజుల క్రితం నారాయణఖేడ్‌లోని ఓ బ్యాంకు ఉద్యోగి కూడా ఈ రోడ్డుపై ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు.

ప్రమాదకరంగా కాజ్‌వే

అంతేకాకుండా, సిర్గాపూర్ నుంచి నల్లవాగు వెళ్లే రోడ్డుపై ఉన్న లో లెవల్ కాజ్‌వే కూడా ప్రమాదకరంగా మారింది. కాజ్‌వేపై నీరు నిలవడమే కాకుండా, రోడ్డు మొత్తం గోతులు ఏర్పడడంతో రాత్రి సమయంలో కొత్తగా ప్రయాణించే వారు తప్పనిసరిగా ప్రమాదాల బారిన పడక తప్పని పరిస్థితి నెలకొంది. మూడేళ్ల క్రితం చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను కాంట్రాక్టర్ కేవలం తవ్వించి, ఉన్న రోడ్డును మరింత అధ్వాన్నంగా తయారు చేసినా, అధికారులు కాంట్రాక్టర్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రజలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన నారాయణఖేడ్-సిర్గాపూర్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



కంకరతో రోడ్డు దుస్థితి



గుంతలమయమైన సిర్గాపూర్ రోడ్డు



నిజాంపేట మండలం బల్కాం చెల్క తండా భవానీమాతా ఆలయం చుట్టూ నీటి కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

భక్తజనసంద్రంగా ఆలయాలు

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాలు ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులతో కిటకిటలాడాయి. కొమురవెల్లి మల్లికార్జున స్వామి, నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి, వర్గల్ విద్యా సరస్వతి అమ్మవారి క్షేత్రాలకు భక్తులు భారీగా తరలివచ్చారు.



విద్యాధరి క్షేత్రంలో చిన్నారులకు సామూహిక అక్షర స్వీకారాలు..

కొమురవెల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి సన్నిధి ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు ఆలయ ముఖ మండపంలో, గంగిరేగి చెట్టు వద్ద పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు స్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొని, అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. వారు బండారు, పట్టు వస్త్రాలు సమర్పించి తమ కోరికలు ఈడేర్చమని వేడుకున్నారు. విజయాచల గుట్టపై ఉన్న ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లను కూడా దర్శించుకుని ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు, మొక్కులు చెల్లించుకున్నారు. బెల్లం, కల్లు శాక సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి టంకశాల వెంకటేష్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సత్యసాయి సంజీవని ఆసుపత్రి (కొండపాక) ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

- వర్గల్ : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధికంగా ఉండటంతో స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించారు. అలాగే వర్గల్ విద్యాధరి క్షేత్రంలో మూల నక్షత్ర మహోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం వేద పండితుల వేద మంత్రోచ్చరణలతో మూల నక్షత్ర పూజలు ప్రారంభించారు.



గంగిరేగి చెట్టు వద్ద భక్తుల కోలాహలం

- కల్హేర్ : నిజాంపేట మండలం బల్కంచెల్క తండాలోని విశ్వపాలిని జ్వాలాముఖి భవానీమాతా సమేత సేవాలాల్ మహారాజ్ ఆలయ 13 వ వార్షికోత్సవాలు ఆదివారం కనుల పండువగా జరిగాయి. ఆలయ ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్ సింగ్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవం, సహస్ర నీటి కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి, ఆల్ ఇండియా సాధు, సంతుల తెలంగాణ ప్రతినిధి సంగ్రామ్ మహారాజ్ ప్రవచనం చేశారు.
- కోహెడ : కోహెడ మండలం కూరెళ్ల, తంగెళ్లపల్లి, గుండారెడ్డిపల్లి గ్రామాల మధ్య మోయ తుమ్మెద వాగు ఒడ్డున గల సింగరాయకొండలో జరిగే ప్రతాపరుద్ర సింగరాయ జాతర ప్రాంతాన్ని ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అభిలాష్‌లు ఆదివారం పరిశీలించారు. ఈ జాతర ప్రాంతంపై తంగళ్లపల్లి, కూరెళ్ల గ్రామాల మధ్య సరిహద్దు వివాదం గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. జనవరిలో జరగనున్న జాతర నిర్వహణపై పోలీసులు ముందస్తుగా కసరత్తు చేపట్టారు.

క్రైం కార్నర్

రైతులను మోసం చేస్తున్న ఇద్దరికి రిమాండ్



నిందితులు శ్రీనివాస్, రజనీకర్ రెడ్డి

కోహెడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒక సర్వే నంబర్‌లో అక్రమ రిజిస్ట్రేషన్‌పై అందిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన రాగుల తిరుపతి అలియాస్ రాగుల శ్రీనివాస్, బట్టు రజనీకర్‌రెడ్డిలు కోహెడ గ్రామానికి చెందిన గూళ్ల బాలయ్యను మోసం చేశారు. గత 50 సంవత్సరాల క్రితం కోహెడ శివారులోని వింజపల్లి రోడ్డులో ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిని బాలయ్య తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి దగ్గర సాదా బైనామా ద్వారా కొనుగోలు చేశారు. అయితే, ఈ ఇద్దరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా మోసం చేసి ఒక్కొక్కరు ఒక ఎకరం చొప్పున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విషయంపై బాలయ్య కుమారుడు చంద్రశేఖర్ సీపీ విజయకుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అభిలాష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇది అక్రమ రిజిస్ట్రేషన్ అని తేలడంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

23 మంది బాధితుల ఫిర్యాదు...

ఈ విషయం వెలుగులోకి రావడంతో మరికొంత మంది బాధితులు కోహెడ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేస్తున్నారు. దాదాపు 23 మందికి పైగా ఫిర్యాదులు చేయడంతో ఈ ఇద్దరు వ్యక్తులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల వద్ద 83 డాక్యుమెంట్లు లభ్యం కావడంతో సమగ్ర విచారణ చేస్తున్నట్లు ఏసీపీ సదానందం తెలిపారు.

దాడి కేసులో ఇద్దరికి..



దాడి చేసిన కేసులో అరెస్టయిన వ్యక్తులను చూపుతున్న పోలీసులు

బెజ్జంకి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి పై దాడి చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వడ్లూరు గ్రామానికి చెందిన అన్నాడి సాయిరెడ్డి, అతడి స్నేహితుడు శ్రీమాన్‌ను అదే గ్రామానికి చెందిన నల్వాల శ్రీనివాస్, పైడిపాల మల్లేశం విచక్షణ రహితంగా కొట్టి కారు అద్దాలు ధ్వంసం చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, మల్లేశంను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీను తెలిపారు. సీఐ వెంట చిన్నకోడూరు ఎస్ఐ సైఫ్ అలీ, రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్, బెజ్జంకి ఏఎస్ఐ శంకర్‌రావు ఉన్నారు.

సంక్షిప్తం

రిజర్వేషన్‌లు ఖరారు

బెజ్జంకి. నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్‌లు ఖరారైనట్లు ఎంపీడీవో ప్రవీణ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. జనరల్ మహిళ - దాచారం, ముత్తన్నపేట, బెజ్జంకి క్రాసింగ్, లక్ష్మీపూర్, చీలాపూర్, రేగులపల్లి, జనరల్ - తలారివానిపల్లె, చీలాపూర్‌పల్లి, నర్సింహులపల్లి, గుండారం, పెరకబండ, పోతారం, బీసీ మహిళ- రాంసాగర్, తిమ్మాయ్యపల్లి, దేవక్కపల్లి, బీసీ జనరల్- వడ్లూరు, బెజ్జంకి, గూడెం, ఎస్సీ మహిళ- బేగంపేట, గాగిల్లాపూర్, తోటపల్లి, ఎస్సీ జనరల్ - గుగ్గిళ్ల, కల్లెపల్లి, వీరాపూర్.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


కనకయ్యకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

దౌల్తాబాద్, నవంబర్ 23 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని గాజులపల్లి గ్రామానికి చెందిన బోయిని కనకయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.40,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

పేదింటి ఆడబిడ్డకు అండగా..

గజ్వేల్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన వర్గంటి అనిత-నాగేష్‌ల కుమార్తె అక్షయ వివాహ నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన నిమ్మ శంకరు పుస్తెమట్టెలను అందజేసి దాతృత్వం చాటుకున్నారు.

స్నేహితురాలి కుటుంబానికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

సిద్దిపేట రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1997-98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మంజుల ఇటీవలే అనారోగ్యంతో మరణించింది. ఈ విషయం తెలుసుకున్న మిత్రులు అందరు కలిసి రూ.42,500లను వారి కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని కుటుంబానికి హామీ ఇచ్చారు.

రేబర్తిలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

మద్దూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం రేబర్తిలో డ్రైనేజీ పనులకు కాంగ్రెస్ నాయకులు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొమ్మగాని శివయ్య మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ నిధులు రూ.2 లక్షలు డ్రైనేజీ పనులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మఠం భద్రయ్య, నాయకులు పుల్లూరి రాజు, పారుపల్లి చారి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం పట్టణ కమిటీ ఎన్నిక

చేర్యాల. నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణ పద్మశాలీ సంఘం కమిటీ ఎన్నిక స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికలో. అధ్యక్షుడిగా కొక్కుల సరేందర్, కార్యదర్శిగా పాము బాలనర్సు, కోశాధికారిగా మలిపెద్ది వెంకటేశ్వర్లు, ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మేడ్చల్ టౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్ చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం మొల్లగూడకు చెందిన గిరిధర్(24) ఆదివారం సాయంత్రం మేడ్చల్ మండలంలోని అక్బర్జాపేటలో జరిగిన ఓ విందు కార్యక్రమంలో పాల్గొని బైక్‌పై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. పూడూరు గ్రామశివారు ప్రాంతంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన గిరిధర్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోరా?

- వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద ప్రయాణికుల ఇక్కట్లు
- జనం రద్దీ పెరిగినా కనిపించని మూత్రశాలలు
- కనీసం బస్సు షెల్టర్ కరువు
- బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు


వెలికట్ట క్రాస్ రోడ్డు కూడలి

కొండపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం రాజీవ్ రహదారిపై ఉన్న వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్లే దారి దుద్దెడ టోల్ ప్లాజా దాటిన తర్వాత ఉన్న క్రాస్ రోడ్డు వద్ద అనునిత్యం వందలాది వాహనాలు వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో ఈ ప్రాంతం సాదాసీదాగా ఉండేది. కానీ ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందిన కూడలిగా ఏర్పడి అనునిత్యం ప్రజలతో రద్దీగా ఉంటుంది. దుద్దెడ పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు అటు హైదరాబాద్ ఇటు సిద్దిపేటకు మరోవైపు చేర్యాల, జనగామతో పాటు పరిసర ప్రాంతాలకు వెళ్లే వారికి ఇది కూడలిగా మారింది. అలాగే క్రాస్ రోడ్ సమీపాన ఫార్మసీ కళాశాల ఉంది. ఇక్కడ వందల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారు వెళ్లే సమయంలో రోడ్డుపైనే బస్సుల కోసం వేచి చూస్తూ ఉంటారు. నేషనల్ హైవే రోడ్డు పనులు క్రాస్ రోడ్ వద్ద వరకు పూర్తయ్యాయి.ఇక్కడ కనీస వసతులు లేకపోవడంతో నానా ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రధానంగా మూత్ర శాలలు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. కూడలి నుంచి 500 మీటర్ల దూరం వరకు ఖాళీ స్థలం లేకపోవడం సమస్యగా మారింది. అలాగే గంటల తరబడి ఎండ, వానలో ఉంటూ బస్సుల కోసం వేచి చూస్తున్నారు. బస్ షెల్టర్లు లేకపోవడంతో రోడ్డుపై కూర్చోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూత్రశాలలతో పాటు మినీ బస్ షెల్టర్ ను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో బస్ షెల్టర్ కోసం స్థల పరిశీలన చేశారు కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు.


రోడ్డుపై బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్ల సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం


గజ్వేల్ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 78వ ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సిద్దిపేట సెక్టార్ ఎన్‌సీసీ కేడెట్లు అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అంతకు ముందు జాతీయ గీతాలాపాన, ఎన్‌సీసీ పతాకావిష్కరణ, కవాతు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిట్స్ ప్రదర్శించారు. డిగ్రీ కళాశాల కేడెట్లు దేశభక్తి గీతాలకు నృత్య ప్రదర్శనతో అలరించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల క్యాడెట్లు స్వాగత నృత్య ప్రదర్శన, ఆపరేషన్ సిందూర్ మీద అద్భుత స్కిట్‌ని ప్రదర్శించారు. కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ బి కృష్ణయ్య పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేడుకలకు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. మట్టా సంపత్‌కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్‌సీసీ పూర్వ అధికారి పి. శ్రీనివాస్ గౌడ్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి సీహెచ్. ఉదయశ్రీ, ప్రభుత్వ పాత ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి బత్తుల బాలయ్య, సుమారు 350 మంది ఎన్‌సీసీ కేడెట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులను అందించే వేదిక:సీఐ

గజ్వేల్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పౌరులను అందించే వేదిక ఎన్‌సీసీ అని గజ్వేల్ సీఐ రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ రవికుమార్ హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎన్‌సీసీ కేడెట్లు స్వచ్ఛభారత్ అభియాన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ ప్రేమ్‌దీప్, ఎన్‌సీసీ అధికారి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తా

డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి



జిల్లా నూతన డీసీసీ అధ్యక్షురాలిగా ఎంపికైన ఆంక్షారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు


గజ్వేల్/చేర్యాల/ములుగు/కొండపాక, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి అన్నారు. కార్యకర్తల కష్టంతోనే తనకు డీసీసీ అధ్యక్ష పదవి దక్కిందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ప్రకటించారు. తనకు బాధ్యతలను అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కాగా జిల్లాకు నూతన డీసీసీ అధ్యక్షురాలిగా ఎన్నికైన ఆంక్షారెడ్డిని ఆదివారం గజ్వేల్‌లోని ఆమె నివాసంలో వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆమెను కలిసి శాలువాతో సత్కరించారు. చేర్యాల నుంచి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌గౌడ్, కొమురవెల్లి మాజీ డైరెక్టర్ వజ్రోజు శంకరాచారి ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ములుగు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నాసాగర్ మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి, గజ్వేల్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నూతన డీసీసీ అధ్యక్షురాలిని కలిసి శాలువా కప్పి సన్మానించారు. అదేవిధంగా కొండపాక మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మేర్గు ప్రభాస్ ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి

గజ్వేల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని అయ్యప్పస్వామి ఆలయాన్ని ఆదివారం ఆయన దర్శించుకున్నారు.వెంట ఆలయ కమిటీ బాధ్యులు దుర్గం, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి నారాయణరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, చిట్కుల శివారెడ్డి, సురేశ్, డప్పు గణేశ్, తదితరులున్నారు.

మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట


మద్దూరు: దూళిమిట్టలో చీరలు పంపిణీ చేస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి


కొండపాకలో చీరలను పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి


సిద్దిపేట రూరల్: పుల్లూరులో చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు

మద్దూరు/సిద్దిపేట రూరల్/కొండపాక/జగదేవ్‌పూర్/వర్గల్/ములుగు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న చీరలపంపిణీ కార్యక్రమం రెండో రోజైన ఆదివారం ముమ్మరంగా కొనసాగింది. కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొని ఇందిరా మహిళాశక్తిలో భాగంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. దూళిమిట్ట మండల కేంద్రంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి , మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే మద్దూరు మండలం సలాఖ్‌పూర్‌లో మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి మహిళా సంఘాల సభ్యులకు చీరల పంపిణీ చేశారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, రావురూకుల గ్రామాల్లో కాంగ్రెస్ సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షుడు గరిపల్లి రాములు ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ చేశారు. కొండపాకలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి డ్వాక్రా మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. జగదేవ్‌పూర్ మండలంలోని పీర్లపల్లిలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. వర్గల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొన్నాల నర్సారెడ్డి ఇందిరమ్మ చీరలను మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. అదేవిధంగా ములుగు మండలంలో లక్ష్మక్కపల్లిలో కాంగ్రెస్ నాయకులు డ్వాక్రా మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

చీరల పంపిణీ ఎన్నికల డ్రామా

- మండల మాజీ జెడ్పీటీసీ భూపాల్ రెడ్డి



దౌల్తాబాద్, నవంబర్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మహిళలకు చీరల పంపిణీ ఎన్నికల డ్రామాగా బీజేపీ దౌల్తాబాద్ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ సర్వోగారి భూపాల్ రెడ్డి అభివర్ణించారు. త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీరలు పంపిణీకి శ్రీకారం చుట్టారని విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయాయని, రెండు బతుకమ్మ పండుగలను మర్చిపోయి ప్రస్తుతం జరిగే పంచాయతీ ఎన్నికల్లో ఎలాగైనా కాంగ్రెస్ ప్రభుత్వం విజయం సాధించాలని మహిళలకు చీరల పంపిణీ మొదలుపెట్టిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరచి కేవలం ఎన్నికల కోసమే డబ్బులు ఖర్చు పెడుతున్నదన్నారు. ప్రజలకు మంచి చేయాలనే తపన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎక్కడా కనబడటం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసే చీరలను మహిళలు తీసుకొని మీ ఓటుతో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ప్రజలను కోరారు.

ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ముగింపు


ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీనగర్‌లో హుస్నాబాద్ ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వారం రోజుల పాటు నిర్వహించిన శీతాకాల శిబిరం ఆదివారం ముగిసింది. సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ హాజరై మాట్లాడారు. విద్యతో పాటు సామాజిక అంశాలపై వారం రోజుల పాటు గ్రామంలో అనేక సమస్యల పట్ల విద్యార్థులు అధ్యయనం చేసి ఎన్నో కొత్త విషయాలను ఆకలింపు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రణధీర్‌కుమార్, హెచ్ఎం పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు

మద్దూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ హెచ్చరించారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి బెల్టు షాపులు నడపకూడదన్నారు. ఒకవేళ ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అక్రమ ఇసుక రవాణతో పాటు ఇతర చట్ట విరుద్ధ పనులకు పాల్పడే వారిపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

సత్యసాయి సేవాసదనం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


బీసీ హాస్టల్‌లో లడ్డూ ప్రసాదం పంపిణీ

సిద్దిపేట కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా సిద్దిపేట సత్యసాయి సేవా సదనంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి సేవాసదనం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం పట్టణంలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన లడ్డు ప్రసాదాన్ని యూత్ సభ్యుల సహకారంతో అందజేశారు. అలాగే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు స్వామి వారి ప్రసాదం లడ్డు, పులిహోరతో పాటుగా బ్రెడ్ పంపిణీ చేశారు.

బెజ్జంకిలో సత్యసాయి జయంతి


పల్లకీసేవ నిర్వహిస్తున్న సత్యసాయి పాఠశాల విద్యార్థులు

బెజ్జంకి. నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి ఉత్సవాలను ఆదివారం బెజ్జంకి మండల కేంద్రంలో భక్తులు, సత్యసాయి పాఠశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సత్యసాయి చిత్ర పటంతో ప్రధాన వీధుల గుండా భజనలు చేస్తూ పల్లకి సేవ నిర్వహించారు. కాగా భక్తులు మంగళ హారతులతో పల్లకీ సేవకు స్వాగతం పలికారు.

ఏడాది గడిచినా ఒక్క హామీ నెరవేర్చలే

- మాటలకే పరిమితమైన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ హామీలు

గజ్వేల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను, హాస్టల్‌ను ఏడాది క్రితం సందర్శించిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఉత్తుత్తి మాటలకే పరిమితమయ్యాయి. గత ఏడాది అక్టోబర్ 24వ తేదీన ఆయన విద్యార్థులకు బోలెడన్ని హామీలతో ఆశలు కల్పించారు. ఆ తర్వాత కళాశాలవైపు ఆయన ఇంతవరకు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కళాశాల హాస్టల్ భవనం, ల్యాబ్, డైనింగ్ సెక్షన్, మెస్ కన్వర్షన్ చేస్తానని చెప్పిన ఆయన ఇప్పటి వరకు ఏ హామీని నిలుపుకోలేకపోయారు. కళాశాలలో నెలకొన్న సమస్యలన్నింటిని అలీబాబా అద్భుతం దీపంలా పరిష్కరిస్తానని చెప్పిన చైర్మన్ ఇప్పటి వరకు కళాశాల సమస్యలపై నోరు విప్పలేదు. కళాశాలలో తమ సీనియర్ అయిన ప్రీతం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ అయ్యారు... ఇక తమ సమస్యలు తీరినట్టేనని భావించిన విద్యార్థులు, అధ్యాపకులు ఆయన పట్టింపులేని ధోరణిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ పదేళ్లు సీఎంగా ఉండి ఏమీ చేయలేకపోయారని ఆరోపించిన ప్రీతం ఏడాదిగా ఏమీ చేయకపోవడంతో ఇతర విద్యార్థి సంఘాల నాయకులు ఆయనను తీవ్రంగా విమర్శిస్తున్నారు.

సిద్దిపేట ఆర్యవైశ్య సంఘం ఆదర్శంగా నిలవాలి


సంఘం నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే సిద్దిపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది ఆదర్శంగా నిలిచామని, అదేస్ఫూర్తితో సిద్దిపేట ఆర్య వైశ్య సంఘం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవితోనే గౌరవం, గుర్తింపు రాదని, చేసే సేవకు, పనికి గుర్తింపు వస్తుందన్నారు. ఆ దిశగా నూతన కార్యవర్గం పని చేయాలన్నారు.

మక్కకంఠంతో..

(5వ పేజీ తరువాయి)

అంటూ తిప్పించుకుంటున్నారని రైతులు మండిపడుతున్నారు.

ఎప్పటివరకు చెల్లిస్తారో..

జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, తొగుట, చేర్యాల, చిన్నకోడూరు, నంగునూరు, కోహెడ, బెజ్జంకి, హుస్నాబాద్, మిరుదొడ్డి మండలాల్లోని మార్కెట్లలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దాదాపు నెలరోజులు అవుతున్నది. ప్రజాప్రతినిధులు, అధికారులు అట్టహాసంగా ఈ కేంద్రాలను ప్రారంభించడంతో రైతులు వెనువెంటనే మక్కలను తెచ్చారు. క్వింటాల్‌కు రూ.2,400 మద్దతు ధర దక్కుతుండడంతో పూర్తిస్థాయిలో ఆరబెట్టిన మక్కలను కేంద్రాల్లో విక్రయించారు. అయితే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కొనుగోళ్లకు సంబంధించి నేటికీ ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాల్లో జమ కాకపోవడం గమనార్హం. మార్క్‌ఫెడ్‌లో నిధులు లేనందునే జమ చేయడం లేదని చెబుతున్నారు. ఎప్పటివరకు చెల్లిస్తారో స్పష్టంగా చెప్పలేదు.

రూ.20కోట్లకుపైగా బకాయి..

ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 8533 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నలను కొనుగోలు చేశారు. క్వింటాల్‌కు రూ.2400 చొప్పున మద్దతు ధర చెల్లిస్తూ రైతుల ఖాతాల్లో జమ చేయాలి. ఈ లెక్కన రూ.20కోట్లకుపైగానే డబ్బు చెల్లించాల్సి ఉంది. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా 28,643 ఎకరాల్లో ఈ దఫా మొక్కజొన్న సాగు చేశారు. మొత్తంగా 6.87 లక్షల క్వింటాళ్ల మక్కలు దిగుబడి రావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు మార్కెట్ యార్డుల్లో విక్రయించింది కేవలం 85వేల క్వింటాళ్లు కావడం గమనార్హం. పెద్దఎత్తున మక్కలను దళారులే కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా తెరచుకోవడంతో రూ.1800 నుంచి రూ.2వేలకే రైతులు ముందస్తుగా అమ్ముకున్నారు. ఇంకా మార్కెట్లకు మక్కలు తెస్తూనే ఉన్నారు.

ప్రతి రోజూ ఎదురుచూస్తున్నా..



మద్దతు ధర దక్కుతుందని తాలు లేకుండా మంచిగా ఆరబెట్టి కేంద్రానికి తీసుకెళ్లాను. మిరుదొడ్డిలోని కొనుగోలు కేంద్రంలో మక్కలు అమ్మినా. కానీ నెలరోజులు దగ్గరకు వస్తున్నా డబ్బులు మాత్రం ఇవ్వలేదు. బ్యాంకులో పడితే మెసేజ్ వస్తుందని ప్రతి రోజూ ఎదురుచూస్తున్నా.

- మొగుళ్ల మల్లేశం, రైతు, మిరుదొడ్డి

ఇందిరమ్మ చీరలతో మహిళలకు ఆత్మగౌరవం

(5వ పేజీ తరువాయి)

ఆర్థిక వృద్ధి సాధించేందుకు పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు, ఇందిరా క్యాంటీన్లు, బస్సులతో పాటు పలు యూనిట్లలో అవకాశం కల్పిస్తామన్నారు. అక్కన్నపేట మండలం చౌటపల్లి వద్ద ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్క్‌లో మహిళలకు ఉపాధి కల్పిస్తామని హామీఇచ్చారు. మహిళల కోసం ప్రత్యేకంగా రైస్‌మిల్లు, ఫుడ్‌ప్రాసెసింగ్, ఇన్నోవేషన్‌లో శిక్షణ కల్పిస్తామని, చెరువులో పట్టిన చేపలతో చేపల పచ్చడి తయారుచేసి ఎక్స్‌పోర్ట్ చేసుకొని ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతులందరూ మహిళా సంఘాల్లో చేరాలని పిలుపునిచ్చారు. ప్రతీ గ్రామంలో మహిళా సంఘాల భవనాలకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లుగా అందలేని వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు ప్రభుత్వం చెల్లిస్తోందని, అక్కన్నపేట మండలంలో రూ.1.20 కోట్లు అందజేశామని తెలిపారు.

హుస్నాబాద్‌లో శిల్పారామం

హుస్నాబాద్‌లోని అమరవీరుల స్తూపం వద్ద 10 ఎకరాల స్థలంలో హైదరాబాద్ తరహాలో శిల్పారామం ఏర్పాటు చేసి, మహిళా శక్తి బజార్ నెలకొల్పుతామని మంత్రి హామీ ఇచ్చారు. కాలుష్య నివారణ కోసం ప్రతి మహిళా సంఘానికి స్టీల్ బ్యాంక్‌ను అందించి, హుస్నాబాద్‌ను ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా మారుస్తున్నామని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టుపై సుప్రీం కోర్టులో కేసు పరిష్కారమైందని, త్వరలోనే కాలువ పనులు పూర్తి చేసి వ్యవసాయ రంగానికి సాగునీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తానని మంత్రి పేర్కొన్నారు. అలాగే, హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ద్వారా ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కోహెడ మండల కేంద్రంలో అయ్యప్ప ఆలయానికి రూ.10 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 22 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్, డీఆర్డీవో జయదేవ్‌ఆర్య, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఎంపీడీవో బానోతు జయరాం, మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సత్యసాయి ఆశయాలు సజీవం

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. బాబా అస్తమించినా, వారి ఆశయాలు నేటికీ నలుదిశలా అమలవుతూనే ఉన్నాయని, ఇంకా వందేళ్లైనా, వెయ్యి సంవత్సరాలైనా బాబా ఆశయాలు కొనసాగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సత్యసాయి సేవలు పుట్టపర్తికే పరిమితం కాలేదని, 166 దేశాల్లో దాదాపు 10 వేల సత్యసాయి సంస్థలు నిరంతరం మానవ సేవలో, ధర్మస్థాపనలో తరిస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో సత్యసాయి సేవల గురించి ప్రస్తావిస్తూ.. గజ్వేల్‌లో సత్యసాయి సృజల పథకం ద్వారా తాగు నీరు అందించారని గుర్తుచేశారు. కొండపాక ఆనంద నిలయం రమణాచారి సహకారంతో, కేసీఆర్ సూచనల మేరకు సిద్దిపేట పక్కనే సత్యసాయి జూనియర్ కళాశాల, అలాగే తెలంగాణలో ఏకైక చిన్న పిల్లల గుండె శస్త్ర చికిత్స ఆసుపత్రిని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా వందలాదిమంది ఇక్కడికి వచ్చి ఉచితంగా చికిత్స పొందుతున్నారని వివరించారు.